ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

శనివారం 27 జనవరి 2024 | 5





మువ్వన్నెల రెపరెపలు



వీరనారి వేషధారణలో లిఖిత



మీ కోసమే వచ్చా..

తిమ్మరాజుపాలెంలో వెంకటలక్ష్మి కుటుంబీకులను ఓదార్చుతున్న భువనేశ్వరి

బాధలు తీరుస్తా..

అధైర్యపడకండి.. అండగా ఉంటాం

బిక్కవోలు/నిడదవోలు/సీతానగరం, జనవరి 26: మనదంతా ఒకటే కుటుంబం.. మీకు ఎప్పుడు ఏ కష్టమొచ్చినా చంద్రబాబు చలించిపోయేవారు.. తక్షణం ఆదుకునే వరకు ఆరాటపడేవారు.. అటువంటి చంద్రబాబునాయుడిని అక్రమంగా అరెస్టు చేసి జైలులో పెడితే మాతో సమంగా మీరంతా ఎంతో చలించిపోయారు. చంద్రబాబు పడే కష్టం, బాధలు చూసి ఆయన్ని అభిమానించి ఆరాధించే మన కుటుంబాల్లో ఎన్నో గుండెలు కొట్టుకోవడం ఆగిపోయాయి.. అని ఎన్టీఆర్ ట్రస్టు చైర్‌పర్సన్, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి అన్నారు. ఆ గుండెల బాధను మీతో మాట్లాడి తీర్చాలని వచ్చా అన్నారు. బిక్కవోలు, సీతానగరం మండలం కాటవరం, నిడదవోలు మండలం కలవచర్ల, పందలపర్రు, తిమ్మరాజుపాలెం గ్రామాల్లో శుక్రవారం 'నిజం గెలవాలి' యాత్ర నిర్వహించారు. ఉదయం బిక్కవోలులో ఒక కుటుంబాన్ని పరామర్శించి అనంతరం నిడదవోలు వెళ్లారు. బాధిత కుటుంబీకులను పరామర్శించారు.. ధైర్యంగా ఉండండి అంటూ భరోసా ఇచ్చారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున చెక్కు అందజేశారు. అనంతరం కాటవరం వెళ్లారు. అడుగడుగునా కార్యకర్తలు, నేతలు స్వాగతం పలికారు. పలు గ్రామాల్లో భారీ ఫ్లెక్సీలు, టీడీపీ జెండాలతో పసుపుమయం చేశారు. పలువురు మహిళలు ఆమెను కలవగా వారిని ఆప్యాయంగా పలకరించారు. ఆమె వెంట టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు తదితరులు ఉన్నారు.

- 3 నియోజకవర్గాల్లో పర్యటన
- ఐదు కుటుంబాలకు పరామర్శ
- ధైర్యం చెప్పిన భువనమ్మ
- రూ.3 లక్షల చొప్పున చెక్‌లు
- వెంట నడిచిన నాయకులు
- ముగిసిన పర్యటన
- హైదరాబాద్‌కు పయనం



బిక్కవోలులో.. ఓదార్పు

బిక్కవోలు, జనవరి 26: టీడీపీ కార్యకర్తలకు ఎటువంటి ఆపద వచ్చినా పార్టీ అండగా ఉండి ఆదుకుంటుందని నారా భువనేశ్వరి తెలిపారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బిక్కవోలు గ్రామంలోని రొక్కల రాణి కుటుంబీకులను పరామర్శించారు. రాణి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబీకులకు రూ.3లక్షల చెక్కు అందజేశారు. చంద్రబాబు అక్రమ అరెస్టులకు నిరసనగా దళిత నేతలు చేపట్టిన రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న పెదపూడి మండలం రాజుపాలెంకు చెందిన కందుకూరి పెద సత్తియ్య అస్వస్థతకు గురవ్వడంతో అతనికి భువనేశ్వరి రూ.20 వేలు సాయం అందించారు.

తిమ్మరాజుపాలెంలో..

నిడదవోలు : చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన కుసుమే వెంకటలక్ష్మి గుండెపోటుతో మృతి చెందింది. ఈ మేరకు ఆమె కుటుంబీకులను భువనేశ్వరి పరామర్శించి కుసుమే వెంకటలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యురాలిని కోల్పోవడం బాధాకరమన్నారు.

అభయమిచ్చి..అండగా నిలిచి



నిడదవోలు: నిడదవోలు మండలం కలవచర్ల గ్రామానికి చెందిన మన్నెం శ్రీనివాసరావుకు టీడీపీ అంటే ప్రాణం.. ఆ పార్టీ కార్యక్రమం ఎక్కడ జరిగినా...భుజాన టీడీపీ జెండా మోస్తూ అందరికంటే ముందు ఉండేవాడు..చంద్రబాబు అక్రమ అరెస్టుతో మనోవేదనకు గురై అకస్మాత్తుగా గుండె ఆగి మరణించాడు. శుక్రవారం శ్రీను కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించి ఓదార్చారు.

కాటవరం వెళ్లి.. కన్నీళ్లు తుడిచి



సీతానగరం: చంద్రబాబు అరెస్టుతో మృతి చెందిన కాటవరం గ్రామానికి చెందిన దాసరి హరిప్రసాద్ కుటుంబీకులను శుక్రవారం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి పరామర్శించారు. ముందుగా మృతుడి సోదరులు దాసరి అప్పారావు, దాసరి శ్రీనివాసరావులను ఓదార్చారు. అనంతరం రూ.3 లక్షల చెక్కు అందించారు. ఆమె వెంట ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి, మాజీ మంత్రి జవహర్, టీడీపీ రాజానగరం ఇన్‌చార్జి బీవీఆర్ చౌదరి ఉన్నారు.



మీకు నేనున్నా.. కంగారొద్దు

నిడదవోలు: టీడీపీ సీనియర్ నాయకుడిగా, మాజీ సర్పంచ్‌గా ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్‌గా బోగిరెడ్డి సత్యనారాయణ (బూరయ్య) సేవలు చిరస్మరణీయమని భువనేశ్వరి అన్నారు. పందలపర్రులో బూరయ్య కుటుంబీకులను ఆమె పరామర్శించి ఓదార్చారు. మీరంతా ధైర్యంగా ఉండి నిజం గెలిపించాలన్నారు. మనం అంతా కష్టసుఖాల్లో కలిసే ఉంటాం.. కలిసే ప్రయాణం చేస్తాం.. అంటూ బూరయ్య భార్యను ఓదార్చారు. టీడీపీ పందలపర్రు గ్రామ నేతలు, కార్యకర్తలు వున్నారు.

భువనేశ్వరికి ఘన వీడ్కోలు



కోరుకొండ: జిల్లాలో "నిజం గెలవాలి" యాత్ర ముగించుకుని శుక్రవారం హైదరాబాద్ బయలుదేరిన నారా భువనేశ్వరికి మధురపూడి విమానాశ్రయం వద్ద పలువురు టీడీపీ నాయకులు వీడ్కోలు పలికారు. టీడీపీ రాజానగరం ఇన్‌చార్జ్ బీవీఆర్ చౌదరి, ఎమ్మెల్యేలు చినరాజప్ప, గోరంట్ల, మాజీ ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బూరుగుపల్లి శేషారావు, మందలపు రవి, చిట్టూరి రంగారావు, పోలిన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎగురవేసిన అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, మంత్రి పినిపే విశ్వరూప్. చిత్రంలో ఎస్పీ శ్రీధర్, జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్

ఘనతంత్రం



- దేశాభివృద్ధికి ప్రతి పౌరుడూ పునరంకితం కావాలి
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ హిమాన్షు శుక్లా పిలుపు
- ముఖ్య అతిథులుగా మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ
- పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన కలెక్టర్, ఎస్పీ
- 378 మంది అధికారులకు ఉత్తమ సేవా పురస్కారాలు
- ఆకట్టుకున్న వివిధ శాఖల శకటాల ప్రదర్శన



అమలాపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): దేశ సమైక్యత, సమగ్రత, సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణతో పాటు కుల, మత, ప్రాంత, భాషా భావాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధికి పునరంకితం కావాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పిలుపునిచ్చారు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం అమలాపురంలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో జాతీయ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, ఎస్పీ ఎస్.శ్రీధర్, జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్, అడ్మిన్ ఎస్పీ ఖాదర్‌బాషాలతో పాటు మరికొంత మంది పాల్గొన్నారు. జిల్లా అభివృద్ధి, ప్రణాళికలు, సంక్షేమ పథకాల అమలు తీరుపై రూపొందించిన పదకొండు పేజీల నివేదికను కలెక్టర్ తన ప్రసంగంలో వివరించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో ప్రజలకు కల్పించిన ప్రాథమిక హక్కులతో పాటు స్వేచ్ఛ, సమానత్వం, లౌకికత్వంతో ప్రతి ఒక్కరూ దేశ సమగ్రాభివృద్ధికి పాటుపడాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాకు సంబంధించిన ఏడాది కాలంలో సాధించిన ప్రగతిని తన ప్రసంగం ద్వారా శాఖల వారీగా కలెక్టర్ శుక్లా వివరించారు. తొలుత కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కలెక్టర్ శుక్లా, ఎస్పీ శ్రీధర్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ ఎస్.శ్రీధర్, కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్ జాతీయ పతాకాలను ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

గ్రామీణాభివృద్ధి శాఖ శకటానికి ప్రథమ స్థానం

గణతంత్ర వేడుకల్లో తొమ్మిది ప్రభుత్వ శాఖల శకటాలను ప్రదర్శించారు.



జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ శకటం ప్రథమ స్థానం సాధించింది. జిల్లా నీటి యాజమాన్య సంస్థ శకటం ద్వితీయ, వ్యవసాయ, ఉద్యానవన శాఖల శకటం తృతీయ, గృహ నిర్మాణ సంస్థ శకటం నాలుగో బహుమతి దక్కించుకున్నాయి.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



సాంస్కృతిక ప్రదర్శనల్లో విజేతలు



బాలయోగి స్టేడియంలో ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శనలు















గణతంత్ర వేడుకల్లో మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ, కలెక్టర్ హిమాన్షు శుక్లా నుంచి ఉత్తమ సేవా పురస్కారాలు అందుకుంటున్న ఎస్పీ శ్రీధర్, వ్యవసాయ శాఖ జేడీ బోసుబాబు, ఐఅండ్‌పీఆర్ అధికారి లక్ష్మీనారాయణ, డీఎంహెచ్‌వో డాక్టర్ దుర్గారావుదొర, డీఈవో కమలకుమారి, డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మశ్రీరాణి

జిల్లా స్థాయి ఉత్తమ సేవా పురస్కార గ్రహీతలు వీరే...

గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని జిల్లా స్థాయిలో 378 మంది ప్రభుత్వ ఉద్యోగులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రశంసాపత్రాలు అందజేశారు. వారిలో జిల్లా స్థాయి అధికారులు 28 మంది ఉన్నారు. ఎస్పీ ఎస్.శ్రీధర్, కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి, అడిషనల్ ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, జిల్లా పంచాయతీ అధికారి వి.కృష్ణకుమారి, జడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సీహెచ్‌ఎన్వీ కృష్ణారెడ్డి, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి, జిల్లా అటవీ శాఖ అధికారి ఎంవీ ప్రసాదరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మశ్రీరాణి, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, జిల్లా సహకార అధికారి ఎ.రాధాకృష్ణ, ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎం.రవికుమార్, జిల్లా దేవస్థానాల అధికారి కేవీఎస్వీవీ ప్రసాద్, అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ రహ్మతుల్లా, చీఫ్ ప్లానింగ్ అధికారి పి.వెంకటేశ్వర్లు, లీడ్ బ్యాంకు మేనేజర్ కాకర శ్యామ్‌బాబు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బీవీ రమణ, జిల్లా ఐఅండ్‌పీఆర్ అధికారి కె.లక్ష్మీనారాయణ, పరిశ్రమల శాఖ జిల్లా జనరల్ మేనేజరు పీకేపీ ప్రసాద్, చేనేత, జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మెట్టి జీఎస్ఆర్‌ఎల్ఎస్ఎన్ రాజు, ఆర్అండ్‌బీ ఈఈ బి.రాము, జిల్లా రిజిస్ట్రార్ డి.శ్రీనివాసులు, సర్వే అండ్ ల్యాండ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ కె.ప్రభాకరరావు, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ బీహెచ్ సందీప్‌రెడ్డి, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ పీఎస్ సురేష్‌కుమార్ అవార్డులు, సర్టిఫికెట్లు అందుకున్నారు. పోలీసు శాఖలో 12 మందికి సేవా పతకాలను ఎస్పీ ఎస్.శ్రీధర్‌తో కలిసి కలెక్టర్ హిమాన్షు శుక్లా అందజేశారు. అమలాపురం డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్, డీసీఆర్బీ ఎస్ఐ ఎన్.నాగేశ్వరరావు, ఏఆర్ ఎస్ఐ కె.వీరప్రసాద్, స్పెషల్ బ్రాంచి హెచ్‌సీ కె.గణేష్‌బాబు సేవా పతకాలను, ఉత్తమ సేవా పతకాన్ని టి.సుబ్బారావు అందుకున్నారు. డీజీపీ కమాండేషన్ డిస్క్‌లను డీఎస్పీ అంబికాప్రసాద్‌తో పాటు సీసీఎస్ ఏఎస్ఐ అయితాబత్తుల బాలకృష్ణ, ఆలమూరు ఏఎస్ఐ కేవీ రమణారెడ్డి, ఎస్‌బీ హెచ్‌సీ కె.గణేష్‌బాబు, డీఎస్పీ హెచ్‌సీ కె.శ్రీనివాసరావు, కాట్రేనికోన హెచ్‌సీ ఎం.శ్రీరామరాజు, అమలాపురం హెచ్‌సీ ఎం.శ్రీనివాసరావులకు అందజేశారు. పరేడ్ కమాండర్ ఎం.నరసింహమూర్తిని ఘనంగా సత్కరించారు.





జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు పీఎస్ సురేష్‌కుమార్, సీసీఎస్ ఏఎస్ఐ అయితాబత్తుల బాలకృష్ణ













ఉత్తమ సేవా పురస్కారాలు అందుకుంటున్న ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సీహెచ్‌ఎన్వీ కృష్ణారెడ్డి, కొత్తపేట ఆర్డీవో ముక్కంటి, డీఆర్డీఏ పీడీ డాక్టర్ శివశంకరప్రసాద్, అడ్మిన్ ఎస్పీ ఖాదర్‌బాషా, చేనేత జౌళి, శాఖ సహాయ సంచాలకుడు గౌరీశంకరరాజు, జిల్లా పంచాయతీ అధికారి కృష్ణకుమారి

మున్సిపల్ కమిషనర్లకు స్థానచలనం

అమలాపురం టౌన్/మండపేట/ముమ్మిడివరం, జనవరి 26: జిల్లాలోని అమలాపురం, మండపేట, ముమ్మిడివరం కమిషనర్లకు స్థానచలనం కలిగింది. అమలాపురం మున్సిపల్ కమిషనరు వి.అయ్యప్పనాయుడును గ్రేటర్ విశాఖపట్నం జోనల్ కమిషనరుగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో కందుకూరు మున్సిపల్ కమిషనరు మనోహర్‌ను నియమించారు. మండపేట మున్సిపల్ కమిషనరు టి.రామ్‌కుమార్‌ను అనంతపురం జిల్లా ధర్మవరం బదిలీ చేశారు. ఆయన స్థానంలో విశాఖ నగరపాలక సంస్థలో జోనల్ కమిషనరుగా పనిచేస్తున్న రామును నియమించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనరు జి.లోవరాజును కృష్ణా జిల్లా తిరువూరు కమిషనరుగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో గుడివాడ మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనరుగా చేస్తున్న టీవీ రంగారావును నియమించారు.

జనసేనలో జోష్!

- రాజోలు, రాజానగరం నియోజకవర్గాలు జనసేనకే
- అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటనతో ఆ పార్టీలో సంబరాలు... 7లో

జనసేనలో జోష్!

- రాజోలు, రాజానగరం నియోజకవర్గాలు జనసేనకే
- అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటనతో ఆ పార్టీలో సంబరాలు
- ఉమ్మడి అభ్యర్థుల ప్రకటనలో ఇప్పటికే మండపేట సీటు టీడీపీకి
- ఇటీవల మండపేట సభలో చంద్రబాబు నేరుగా ప్రకటన
- దీంతో జిల్లాలో మూడు సీట్ల ఒప్పందాలపై పూర్తి స్పష్టత
- వైసీపీలో అధికారిక ప్రకటనలేవీ లేకపోవడంతో అయోమయం

రానున్న సాధారణ ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడిగా పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో ఎవరికి ఎన్ని సీట్లు అనే ప్రకటన ఇప్పటివరకు రానప్పటికీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మాత్రం మూడు సీట్ల విషయంలో పూర్తి స్పష్టత వచ్చేసింది. ఇటీవల మండపేటలో జరిగిన రా.. కదలిరా.. సభలో చంద్రబాబు అక్కడి నుంచి పోటీ చేసే అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పేరును ప్రకటించారు. దీంతో ఇక్కడి నుంచి టీడీపీ తిరిగి పోటీ చేస్తుందనేది స్పష్టమైపోయింది. అదేవిధంగా శుక్రవారం జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తాము వచ్చే ఎన్నికల్లో రాజోలు, రాజానగరం నియోజకవర్గాల నుంచి పోటీ చేయబోతున్నట్టు ప్రకటించారు. ఈవిధంగా ఆ రెండు చోట్ల జనసేన బరిలోకి దిగుతున్నట్టు తేలిపోయింది. ఆయా నియోజకవర్గాల్లో పూర్తి స్పష్టత రావడంతో మండపేటలో టీడీపీ, ఇటు రాజోలు, రాజానగరంలలో జనసేన శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి.

రాజానగరం జనసేనకే..

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

రాజానగరం నుంచి జనసేన పోటీ చేస్తుందని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించడంతో ఆ నియోజకవర్గంలోని జనసేన సంబరాలు చేసుకుంటోంది. టీడీపీ, జనసేన ఉమ్మడిగా వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తుందని చెబుతూ టీడీపీ రెండు సీట్లు ఇప్పటికే ప్రకటించినందున తాము కూడా రెండు సీట్లను ప్రకటిస్తున్నట్టు జనసేన అధినేత స్పష్టం చేశారు. అయితే అభ్యర్థి ఎవరనేది ఇంకా స్పష్టత ఇవ్వాల్సి ఉంది. అయితే ఇక్కడ ఇంతవరకూ జనసే పార్టీ కోసం పనిచేస్తున్న బత్తుల బలరామకృష్ణ వర్గం మాత్రం తమకే టిక్కెట్టు ఖరారైనట్టు చెబుతోంది. గతంలో ఇక్కడ టీడీపీ ఎమ్మెల్యేగా రాజానగరం మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ పనిచేశారు. తర్వాత నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగానూ కొనసాగారు. అనంతరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బొడ్డు వెంకటరమణ చౌదరి (బీవీఆర్ చౌదరి)ని ప్రకటించింది. దాంతో ఆయన నియోజకవర్గ బాధ్యతలను తన భుజానకెత్తుకున్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. పవన్ కల్యాణ్ రాజానగరం సీటును ప్రకటించిన సమయానికి నిజం గెలవాలి అనే కార్యక్రమంలో భాగంగా సీతానగరం మండలంలో కాటవరంలో పర్యటించిన నారా భువనేశ్వరి వెంట ఉన్నారు. పవన్‌కల్యాణ్ ప్రకటనపై ఆయన ఎలాంటి స్పందన వ్యక్తంచేయలేదు. అధిష్ఠానం సూచనల కోసం ఎదురుచూస్తున్నట్టు ఆయన వర్గీయులు చెబుతున్నారు.

వైసీపీలో అయోమయం

అధికారిక ప్రకటన కోసం ఎదురుచూపులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఇప్పటివరకు వైసీపీ తమ అభ్యర్థులను అధికారికంగా ప్రకటించలేదు. అయితే కాకినాడ జిల్లాలో ముగ్గురు ఇన్‌చార్జులను మార్చి కొత్త వారిని నియమించింది. అలాగే కోనసీమ జిల్లాలో పి.గన్నవరం ఇన్‌చార్జిని నియమించింది. రామచంద్రపురం నుంచి గతంలో పోటీచేసిన మంత్రి వేణును రాజమహేంద్రవరం రూరల్‌కు మార్చింది. తూర్పుగోదావరి జిల్లాలో రాజమండ్రి సిటీ ఇన్‌చార్జిగా భరత్‌ను నియమించగా, కొవ్వూరు నుంచి గోపాలపురం నియోజకవర్గానికి వనితను వైసీపీ అధిష్ఠానం మార్చింది.

రాజోలు మళ్లీ జనసేనకే..
మండపేట మళ్లీ టీడీపీకే..

(అమలాపురం -ఆంధ్రజ్యోతి)

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కోనసీమ జిల్లాలోని రాజోలు నియోజకవర్గంలో జనసేన పోటీ చేస్తుందని గణతంత్ర దినోత్సవ వేడుకల్లో చేసిన ప్రకటన ఆ పార్టీలో జోష్ నింపింది. గతంలో జనసేన ఇక్కడి నుంచే గెలుపొందిన విషయం తెలిసిందే. టీడీపీ, జనసేన ఉమ్మడిగా పోటీచేయబోతున్న నేపథ్యంలో రాజోలు సీటు నుంచి తమ పార్టీ పోటీ చేస్తుందని పవన్ ఈ ప్రకటన చేశారు. ఇది ఆ పార్టీ కేడర్‌లో ఉత్సాహాన్ని నింపింది. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఇక్కడ నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తారని ఆ పార్టీ కేడర్ భావించింది. కొన్ని నెలల కిందట ఇరుపార్టీల మధ్య పొత్తుపొడవడంతో అప్పటి నుంచి రాజోలు సీటుపై సందిగ్ధం నెలకొంది. ఎందుకంటే గత ఎన్నికల్లో రాష్ట్రంలోనే జనసేన నుంచి రాపాక వరప్రసాదరావు ఏకైక ఎమ్మెల్యేగా గెలిచారు. తరువాత వైసీపీలో చేరారు. అయితే జనసేనకు సిట్టింగ్ స్థానమైన రాజోలు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం నుంచి తిరిగి జనసేన పోటీలో ఉంటుందని ఆ పార్టీ భావిస్తూ వస్తోంది. శుక్రవారం పవన్‌కల్యాణ్ చేసిన ప్రకటనతో ఆ నియోజకవర్గంలో పూర్తి స్పష్టత వచ్చేసింది. టీడీపీ సిట్టింగ్ స్థానమైన మండపేట నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తిరిగి పోటీ చేస్తారని చంద్రబాబు ప్రకటించగా, జనసేన సిటింగ్ స్థానాన్ని పవన్‌కల్యాణ్ ప్రకటించడంతో కోనసీమ జిల్లాలో ఉన్న ఏడు నియోజకవర్గాల్లో ఇక ఐదు నియోజకవర్గాల్లోనే పొత్తు ప్రకారం సీట్ల కేటాయింపు జరగాల్సి ఉంది. ఇప్పటివరకు రాష్ట్రంలో మరెక్కడా జరగని రీతిలో కోనసీమలో చెరో స్థానంలో టీడీపీ, జనసేనలు తమ అభ్యర్థులు పోటీ చేస్తారని ప్రకటించాయి. ఈ ప్రకటన వెలువడిన వెంటనే రాజోలు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావుతో పార్టీలోకి కీలక నేతలు మాట్లాడినట్టు సమాచారం. సూర్యారావు కీలక నేతలతో సంభాషించిన తర్వాత మౌనంగానే ఉన్నారు. కాగా రాజోలు ఎస్సీ రిజర్వుడు అసెంబ్లీ జనసేన అభ్యర్థిత్వం కోసం పలువురి పేర్లు ప్రచారంలో ఉన్నాయి. వారిలో ఒకరు సివిల్ సప్లయిస్ హోదాలో పనిచేసిన దిండి గ్రామానికి చెందిన దేవ వరప్రసాద్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. జనసేన పార్టీ ప్రణాళికల్లో వరప్రసాద్ కీలక పాత్ర వహించారనే ప్రచారం ఉంది. ఇప్పటికే వైసీపీ నుంచి జనసేనలో చేరిన విశ్రాంత చీఫ్ ఇంజనీర్ బొంతు రాజేశ్వరరావుతోపాటు డాక్టర్ రాపాక రమేష్ పేర్లు వినిపిస్తున్నాయి. జనసేన అభ్యర్థినీ ఖరారుచేస్తే ఇక ఎన్నికల జోష్ ఊపందుకుంటుంది.



కేంద్ర కారాగారంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న డీఐజీ రవికిరణ్



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

ఘనంగా గణతంత్ర దినోత్సవం

రాజమహేంద్రవరం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జాతికి స్వేచ్ఛా వాయువులను.. దృఢమైన రాజ్యాంగం గొడుగు కింద గర్వంగా జీవించే అదృష్టాన్ని ప్రసాదించిన మహానుభావులను కీర్తిస్తూ మువ్వన్నెల పతాకం ఠీవిగా రెపరెపలాడింది. 75వ గణతంత్ర దినోత్సవ సంబరాలు శుక్రవారం అంబరాన్నంటాయి. జిల్లా కోర్టు ఆవరణలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. గణతంత్ర దినోత్సవ గొప్పదనాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నాగేశ్వరరావు, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి పాల్గొన్నారు. కేంద్ర కారాగార ప్రాంగణంలో జైళ్లశాఖ కోస్తాంధ్ర ప్రాంత డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎంఆర్ రవికిరణ్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్ రాజ్‌కుమార్, ఏఎస్ డి.రాఘవేంద్రరావు, డీఎస్ బి.రత్నరాజులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో రిపబ్లిక్ డే వేడుకలు



జాతీయ జెండా ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న బీఎం శ్రీనివాసరావు, ఉద్యోగులు

దివాన్‌చెరువు, జనవరి26: మన రాజ్యాంగం విశిష్టతను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన గురుతర బాధ్యత మనందరిపై ఉందని ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. దివాన్‌చెరువులోని ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో భారత గణతంత్ర దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం ప్రతి ఒక్కరికీ ఎంతో ముఖ్యమైన పండుగలని అన్నారు. ఈ స్ఫూర్తిని భావి తరాలకు తెలియజెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి బీహెచ్‌వీ మంగేష్, సర్క్యులేషన్ మేనేజర్ బి.గోపాలకృష్ణ, జిల్లా రిపోర్టర్స్ ఇన్‌చార్జి ఎస్ఎస్ఎస్ సత్యనారాయణ, ప్రొడక్షన్ ఇన్‌చార్జి ఎం.రాజేంద్ర, సిస్టమ్స్ ఇన్‌చార్జి ఎన్.శివకుమార్, సబ్‌ఎడిటర్ జి.శేషగిరిరావు, రిపోర్టర్లు పి.రమేష్‌నాగేంద్ర, వీర్రాజు, కాదంబరి శ్రీనివాస్, ఫొటోగ్రాఫర్ ఎస్.రాంబాబు, యాడ్స్ విభాగ సిబ్బంది బీవీ సుబ్రహ్మణ్యం, ఎం.రవీంద్రప్రసాద్, కె.కిరణ్‌కుమార్, కార్యాలయ సిబ్బంది జి.వీరభద్రరాజు, జి.ఈశ్వరరావు, సెక్యూరిటీ సూపర్‌వైజర్ ఎ.చిన్నకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



దేశభక్తి స్ఫూర్తి నింపిన.. 150మీటర్ల జాతీయ పతాకం

రాజమహేంద్రవరం, జనవరి26(ఆంధ్రజ్యోతి): 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా 150 మీటర్ల భారీ జాతీయ పతాకంతో కేశవరెడ్డి స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు భరతమాత, గాంధీజీ, సుభాశ్ చంద్రబోస్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఛత్రపతి శివాజీ, రుద్రమదేవి, కట్టబ్రహ్మన్న, అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్, తాంతియాతోపే వేషధారణలతో అలరించారు. పిరమిడ్ విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కేశవరెడ్డి విద్యా సంస్థల ఛైర్మన్ ఎస్.కేశవరెడ్డి తన సందేశాన్ని విద్యార్థులకు పంపించారు.





జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఐడియల్ కళాశాల అకడమిక్ డైరెక్టర్ రంజిత్... 'స్వప్నం రాల్చిన అమృతం' నాటికలో ఓసన్నివేశం

చంద్రమాంపల్లిలో ముగిసిన రాష్ట్రస్థాయి నాటిక పోటీలు

పెద్దాపురం, జనవరి 26: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని చంద్రమాంపల్లి (దివిలి) గ్రామంలో స్నేహ ఆర్ట్స్ ఆధ్వర్యంలో గత మూడ్రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి నాటికల పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల రాష్ట్రస్థాయి నాటిక పోటీల్లో చివరిరోజు ముఖ్య అతిథిగా ఐడియల్ కళాశాల అకడమిక్ డైరెక్టర్ ఎం.రంజిత్ హాజరై ప్రసంగించారు. నాటక రంగాన్ని బతికించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్నేహ ఆర్ట్స్ అధ్యక్షుడు గొందేసి రాజా, ఇంధన బ్రహ్మానందం, దేవాడ పాపేశ్వరరావు, మంతెన సత్తిబాబు, మానేపల్లి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. కాగా చైతన్య కళాభారతీ (కరీంనగర్) ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వప్నం రాల్చిన అమృతం' నాటిక ఎంతగానో ఆకట్టుకుంది. ఈ నాటికను పరమాత్ముని శివరామ్ రచన, మంచాల రమేష్ దర్శకత్వం వహించారు. అలాగే మిత్రా క్రియేషన్స్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'లక్ష్మణరేఖ దాటితే' నాటిక ఎంతగానో ఆకట్టుకుంది. దీనికి రచన కోన గోవిందరావు, ఎంఎమ్ బాషా దర్శకత్వం వహించారు. అలాగే సహృదయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'నేరస్థులు' నాటిక కూడా ఎంతగానో ఆకట్టుకుంది. ఈ నాటికకు రచన, నాగాభట్ల బాపన్నశాస్త్రి దర్శకత్వం వహించారు.



ప్రియాంక గార్డెన్స్‌లో టీడీపీ, జనసేన సమావేశంలో ఏర్పాట్లపై సమీక్షిస్తున్న నేతలు

రా కదలిరా.. బహిరంగ సభను విజయవంతం చేద్దాం!

జిల్లా టీడీపీ- జనసేన నేతల నిర్ణయం.. నియోజకవర్గాల నుంచి కలిసి ర్యాలీతో రావాలని గోరంట్ల, దుర్గేష్ సూచన

రాజమహేంద్రవరం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఈనెల 29న కాతేరులో జరిగే తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా భారీ బహిరంగసభను విజయవంతం చేయాలని జిల్లా టీడీపీ-జనసేన నేతలు నిర్ణయించారు. స్థానిక ప్రియాంక గార్డెన్స్‌లో శుక్రవారం రాత్రి జిల్లాలో టీడీపీ- జనసేన నేతలు సమావేశమై పలు నిర్ణయాలు తీసుకున్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, జనసేన పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్, సిటీజనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గోపాలపురం టీడీపీ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు, నిడదవోలు ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, రాజానగరం జనసేన ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ, కొవ్వూరు జనసేన ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, అనపర్తి జనసేన ఇన్‌చార్జి తదితరులు పాల్గొన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు పాల్గొనే సభను విజయవంతం చేయడానికి రెండు పార్టీలు సమన్వయంతో పనిచేయాలని, ఆయా నియోజకవర్గాల్లోని గ్రామాల నుంచి రెండు పార్టీల నేతలు కలసి ర్యాలీతో రావాలని నిర్ణయించారు. జోన్- 2 కోఆర్డినేటర్ మండలపు రవికుమార్ పలు సూచనలు చేశారు. టీడీపీ నేత గోరంట్ల బుచ్చయ్యచౌదరి, జనసేన నేత కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఈ బహిరంగ సభను విజయవంతం చేయడం ద్వారా జిల్లాలో ఎన్నికల శంఖారావం పూరించడంతోపాటు మన బలం కూడా నిరూపించుకోవచ్చని ఆయన పిలుపునిచ్చారు.

పూర్తిగా కాలిపోయిన గుర్తుతెలియని మృతదేహం



రంగంపేట, జనవరి, 26 : రంగంపేట మండలం పాతవీరంపాలెం గ్రామశివారులోని జీడిమామిడి తోటలో అనుమానాస్పద స్థితిలో పూర్తిగా కాలిపోయిన గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించారు. పాతవీరంపాలెం వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగంపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పి.విజయ్‌కుమార్ తెలిపారు. వివరాలు ఎవరికైనా తెలిస్తే ఎస్ఐ రంగంపేట 9440904854, సీఐ అనపర్తి 9440796538 నెంబర్లకు తెలియజేయాలని ఎస్ఐ పి.విజయ్‌కుమార్ కోరారు.

ఆ రైతు చనిపోయాడనుకొని..



రైతు పూసయ్య

రంగంపేట మండలం పాత వీరంపాలెం గ్రామానికి చెందిన రైతు శుక్రవారం గ్రామశివారు గల తన జీడిమామిడితోటలో పూర్తిగా కాలిపోయిన మృతదేహాన్ని చూసి ఓ రైతు తన బంధువులకు సమాచారం తెలపగా వారువచ్చి సెల్‌ఫోన్, మోటార్‌సైకిల్‌ను చూసి అవి కేతమళ్ళ పూసయ్యకు సంబంధించినవే అని నిర్ధారించుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొంత సమయానికి పూసయ్య వదిలివెళ్లిన అతని సెల్‌ఫోన్‌కే ఫోన్‌చేసి తనకు గాయాలయ్యాయని, బతికే ఉన్నానని చెప్పగా బంధువులంతా తిరిగి అతను దగ్గరకు వెళ్లి రాజమహేంద్రవరం ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి వైద్యం చేయించారు. శుక్రవారం తాను పొలంలోకి వెళ్లగా అప్పటికే అక్కడికి చంపేసి తీసుకొచ్చిన శవాన్ని గుర్తుతెలియని తీసుకురాగా, వారంతా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దొంగిలించే దొంగల్లా ఉన్నారని.. వారిని ప్రశ్నించగా తనపై దాడి చేసి కొంతదూరం ఆటోలో తీసుకెళ్లి వదిలివేశారని ఆ రైతు తెలిపాడు. తను నెమ్మదిగా మెయిన్‌మీదకు వచ్చి వేరే ఫోన్‌తో తన ఫోన్‌కు ఫోన్ చేశానని తెలిపాడు.

మునికోటేశ్వరరావుకు భువనేశ్వరి కృతజ్ఞతలు



భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న మునికోటేశ్వరరావు కుటుంబ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 26 : చంద్రబాబు జైలులో ఉన్న సమయంలో 52 రోజులపాటు ఆయన కుటుంబం ఇక్కడే ఉన్న విషయం తెలిసిందే. ఆ సమయంలో షెల్టర్ ఇచ్చిన అక్కిన మునికోటేశ్వరరావును టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గత మూడురోజులుగా ఉమ్మడి జిల్లాలో నిజంగెలవాలి కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తున్నారు. శుక్రవారం రాజమహేంద్రవరం చేరుకుని మునికోటేశ్వరరావు కుటుంబీకులను కలుసుకుని కాసేపు మాట్లాడారు. భువనేశ్వరికి సాదర స్వాగతం పలికారు. ఆమె అక్కడి నుంచి బయలుదేరి హైదరాబాద్ వెళ్లిపోయారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్



పోగొట్టుకున్న వస్తువులను అందజేస్తున్న డిపో మేనేజర్ రామన్నదొర

గోకవరం, జనవరి 26: ప్రయాణికురాలు బస్సులో మర్చిపోయిన విలువైన వస్తువులను తిరిగి జాగ్రత్తగా ఆమెకు అందజేసిన ఆర్టీసీ కండక్టర్‌ను పలువురు అభినందించారు. గోకవరం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు గురువారం మండపేట సర్వీస్‌కు బయలుదేరి వెళ్లింది. కొత్తతుంగపాడుకు చెందిన ముచ్చిక గన్నెమ్మ ఆ బస్సులో బంగారు వస్తువులు, పట్టీలు మర్చిపోయి బస్సు దిగి వెళ్లిపోయింది. ఇది గమనించిన ఆ బస్సు కండక్టర్ శేఖర్ ఆ వస్తువులను డిపోకు తెచ్చి మేనేజర్ రామన్నదొరకు అప్పగించారు. చివరకు గన్నెమ్మకు విషయాన్ని చేరవేసి బస్సులో ఆమె మర్చిపోయిన వస్తువులను శుక్రవారం అందజేశారు. వస్తువుల విలువ రూ.60,000 ఉంటుంది.

ఏకే మల్లవరంలో బెల్ట్‌షాపుపై దాడి

100 మద్యం బాటిళ్లు స్వాధీనం

గొల్లప్రోలు రూరల్, జనవరి 26: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో నిర్వహిస్తున్న మద్యం బెల్ట్‌షాపుపై ఎస్ఐ బాలాజీ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. పిఠాపురం, గొల్లప్రోలు ప్రాంతాల్లోని షాపులు నుంచి కొనుగోలు చేసి అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నట్టు గుర్తించారు. 100 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని గొల్లప్రోలు పట్టణానికి చెందిన పాలిశెట్టి నాగచక్ర, ఏకే మల్లవరం గ్రామానికి చెందిన మడికి సురేంద్రలను అరెస్టు చేశారు.

గొల్లప్రోలు మండలం ఏకే మల్లవరంలో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్ఐ బాలాజీ →



టీడీపీ, జనసేన వైపు చూస్తున్న 70 మంది వైసీపీ ఎమ్మెల్యేలు

ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, జనవరి26: టీడీపీ, జనసేన పొత్తుతో 70 మంది వైసీపీకి చెందిన ఎమ్మెల్యేలు, నేతలు టీడీపీ, జనసేన వైపు చూస్తున్నారని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక విలేకరులతో ఆయన శుక్రవారం మాట్లాడారు. వైసీపీకి చెందిన ఎమ్మెల్యేలు వారు ఏ నిముషంలోనైనా పార్టీలోకి చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పవన్‌కల్యాణ్ రాజోలు, రాజానగరం అసెంబ్లీ సీట్లను ప్రకటించగానే వైసీపీ కాపు నేతలు కావాలనే రాద్ధాంతం చేస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో కాపుల అభ్యున్నతికి వేలాది కోట్ల రూపాయలు కేటాయించామని, విదేశీ విద్యతోపాటు అనేక కార్యక్రమాలు చంద్రబాబు చేపట్టారని గుర్తుచేశారు. కాపులకు వైసీపీ చేసింది ఏమీ లేదని విమర్శించారు. టీడీపీ, జనసేన పొత్తుతో వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తాయని చినరాజప్ప పేర్కొన్నారు.





నల్లజర్ల ఫారెస్ట్‌లో పులి అడుగు జాడలను పరిశీలిస్తున్న డీఆర్‌వో వేణుగోపాల్, సిబ్బంది

పెద్ద పులి ఆచూకీ కోసం అధికారుల అన్వేషణ

నల్లజర్ల, జనవరి 26 : తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తోంది.. దీంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారని శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంతో అటవీశాఖ అధికారులు స్పందించారు. డీఆర్‌వో వేణుగోపాల్ తన సిబ్బందితో ఉదయం 9 గంటల నుంచే పెద్ద పులి ఆచూకీ కోసం అన్వేషణ ప్రారంభించారు. పులి పాదముద్రలు సేకరించారు. పులివెళ్లిన ప్రదేశాలను పరిశీలించారు. సుమారు 5 కిలోమీటర్ల దూరం వరకు పులి పాదముద్రలు ఉన్నాయి. నేల తేమశాతం లేకపోవడం వల్ల ఇసుకపైనే పులి పాదముద్రలు ఎక్కువగా ఉన్నట్టు అధికారులు గుర్తించారు. సేకరించిన ప్లగ్ మార్క్స్‌ను ఉన్నతాధికారులకు పంపించామని, త్వరలో సీసీ కెమెరా ఏర్పాటుచేసి పులిని పట్టుకుంటామని డీఆర్‌వో పేర్కొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

రాజోలు, జనవరి 26: విద్యాలయాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైసీపీ నాయకుడు కంచర్ల శేఖర్ ఆర్థిక సహాయంతో ఏర్పాటుచేసి లైబ్రరీని శుక్రవారం ప్రారంభించారు. ప్రిన్సిపాల్ సాయిబాబు, జడ్పీటీసీ మట్టా శైలజ, సర్పంచ్ రేవు జ్యోతి, ఎంపీటీసీ చెల్లింగి లక్ష్మీశ్వరి, విశ్రాంత ఎంఈవో జొన్నలగడ్డ గోపాలకృష్ణ, పొన్నాడ సూర్యప్రకాష్, దార్ల పెదబాబు పాల్గొన్నారు. కళాశాలలో నిర్మించిన ఆర్చ్‌ను ప్రారంభించారు.

- కోనసీమ జిల్లాలో గణతంత్ర వేడుకలు
- జాతీయ జెండాలను ఎగురవేసిన అధికారులు
- విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

రెపరెపలాడిన జాతీయ పతాకం




అమలాపురంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న గొల్లపల్లి సూర్యారావు, కొత్తపేట: జాతీయ పతాకానికి వందనం చేస్తున్న బండారు సత్యానందరావు

అమలాపురం టౌన్, జనవరి 26: అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని టీడీపీ కార్యాలయం వద్ద నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. నాయకులు మెట్ల రమణబాబు, పెచ్చెట్టి విజయలక్ష్మి, జంగా అబ్బాయివెంకన్న, భాస్కర్ల రామకృష్ణ, బత్తుల ప్రసాద్ పాల్గొన్నారు. త్రిరత్న బుద్ధవిహార్ వద్ద జాతీయ పతాకాన్ని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆవిష్కరించారు. నాయకులు చిటికెల రామ్మోహనరావు, తాడి సత్యనారాయణ, కొల్లాబత్తుల కుమార్, చాగంటి స్వామి, పిండి సత్యనారాయణ పాల్గొన్నారు. అమలాపురం కోర్టు ప్రాంగణంలో రెండో అదనపు జిల్లా జడ్జీ వి.నరేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా న్యాయమూర్తులు కె.శైలజ, వి.గౌరీశంకరరావు, ఎ.హిమబిందు, బార్‌అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు.

ముమ్మిడివరం: గణతంత్ర వేడుకలను ముమ్మిడివరంలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయం వద్ద కమిషనర్ జి.లోవరాజు, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో జె.రాంబాబు, ప్రభుత్వాసుపత్రి వద్ద సూపరింటెండెంట్ డాక్టర్ దయానా, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సబ్‌రిజిస్ట్రార్ ఆర్.రాంబాబు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకర్, జూనియర్ కళాశాల వద్ద ప్రిన్సిపాల్ ఎస్.మంగారామ్, గురుకుల పాఠశాల వద్ద ప్రిన్సిపాల్ టి.గంగాభవానీ, ఉన్నత పాఠశాలల వద్ద హెచ్‌ఎంలు సీహెచ్ పరిమళ, బి.హనుమంతరావు, జిల్లా కార్యాలయాల వద్ద ఆయా కార్యాలయాల అధికారులు, పాఠశాలల వద్ద హెచ్‌ఎంలు, గ్రామసచివాలయాల వద్ద కార్యదర్శులు జాతీయ పతాకాలను ఆవిష్కరించి గణతంత్ర వేడుకలు జరుపుకున్నారు. ముమ్మిడివరం జనసేన పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గ ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ, ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మలికిపురం: మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు జెండా ఎగురవేశారు. జడ్పీటీసీ ప్రసన్నకుమారి, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, ఎంపీడీవో ముత్యంనాయుడు, తహసీల్దార్ వీవీ నరసింహారావు పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద జెండా వందనాలు చేశారు.

రాయవరం: రాయవరం తహశీల్దారు కార్యాలయం వద్ద తహశీల్దారు ప్రకాష్‌బాబు, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో నరేంద్రరెడ్డి, పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్‌ఐ నరేష్ జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు. భాష్యం స్కూల్ వద్ద ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసగుప్తా ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురువేసి చిన్నారులు దేశ నాయకుల వేషధారణలతో చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మండలంలో 12గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటుపాఠశాలలు,బ్యాంక్‌లు ప్రభుత్వ కార్యాలయాల వద్ద రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించారు.

కపిలేశ్వరపురం: స్థానిక మండలపరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కార్యాలయం వద్ద డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీడీపీవో ఎ.గజలక్ష్మిలు జాతీయ జెండాలను ఆవిష్కరించి జెండావందనం చేశారు. మండలంలోని పంచాయతీ కార్యాలయాల వద్ద ఆయా గ్రామాల కార్యదర్శులు, పాఠశాలల వద్ద ఎంఈవో తాతారావు, పాఠశాలల హెచ్‌ఎంలు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు, జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, గ్రామసర్పంచ్ సాకా శ్రీనివాస్, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వివిధశాఖల అధికారులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.

అంతర్వేది: సఖినేటిపల్లి మండలం సమతా కల్యాణ మండపం వద్ద, మూడుతూముల వద్ద గణతంత్ర వేడుకల్లో భాగంగా అంబేడ్కర్ విగ్రహాలకు మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ: మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో కీర్తిస్పందన జాతీయజెండాను ఆవిష్కరించారు. ఎంపీపీ అంబటి భవానీ, ఎంఈవో శ్రీనివాస్, ఈవోపీఆర్డీ ఎన్.షెలత్ రాజు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ద్రాక్షారామలో అంబేడ్కర్ సెంటర్‌లో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ జాతీయపతాకావిష్కరణ జరిపారు. సర్పంచ్ కొత్తపల్లిఅరుణ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు జాతీయ పతాకావిష్కరణ జరిపారు. డీటీ జి.శ్రీనివాస్, రీసర్వే డీటీ కె.మహాలక్ష్మీనాయుడు, వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు. మండలంలో పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాల వద్ద జాతీయ పతాకావిష్కరణ జరిపారు.

కె.గంగవరం: కె.గంగవరంలోని తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, మండల వనరుల కేంద్రం, వెలుగు కార్యాలయం, పోలీసు స్టేషన్ వద్ద, ఆయా కార్యాలయాల ఉద్యోగులు జెండా ఆవిష్కరించారు. గ్రామ సచివాలయాల వద్ద, పాఠశాలల్లో జెండా ఆవిష్కరణలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఈకార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అంబాజీపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.సత్యనారాయణమూర్తి, పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్‌ఐ డి.చైతన్యకుమార్, తహసీల్దారు కార్యాలయం వద్ద డిప్యూటీ తహసీల్దారు నాగపద్మలక్ష్మి, మాచవరం పంచాయతీ కార్యాలయం వద్ద కార్యదర్శి జీజీవీకే కుమార్‌లు జాతీయ జెండాను ఎగురవేశారు. ఆయా పాఠశాలల వద్ద హెచ్‌ఎంలు, పంచాయతీ కార్యాలయాల వద్ద కార్యదర్శులు త్రివర్ణపతాకాన్ని ఆవిష్కరించారు. ఈకార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

మామిడికుదురు: స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ కె.వనజాకుమారి, తహసీల్దార్ కార్యాలయం ఎదుట తహసీల్దార్ రియాజ్‌హుస్సేన్, నగరం పోలీసుస్టేషన్ వద్దఎస్‌ఐ పి.సురేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలవద్ద, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.ఈకార్యక్రమాల్లో వివిధ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజోలు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో ఎన్.బాలాజీ, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ బి.ముక్తేశ్వరరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వద్ద సీఐ ఆర్.గోవిందరాజు, మండల రిసోర్సుపర్సన్ కార్యాలయం వద్ద ఎంఈవో ఎన్.మనోహరం జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఎంపీపీ కేతా శ్రీను, వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇస్మాయిల్, ఎంపీటీసీలు ఉండ్రు సూర్యారావు, దార్ల కుమారిలక్ష్మి, ఏవో ఎం.సత్యనారాయణ, ఎంజీ ఎన్ఆర్జీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ జీఆర్ ఠాగూర్, మండలపరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో ఎం.భారతీ, పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్‌ఐ హరికోటి శాస్త్రి, పి.గన్నవరం హైస్కూల్‌లో హెచ్‌ఎం డీఎస్‌వీ ప్రసాద్, స్కూల్ విద్యా కమిటీ ఛైర్మన్ గూటం శ్రీనివాసరావు, పోతవరం మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం కత్తుల ఆనందరావులు జాతీయజెండాలను ఎగురవేశారు.

అలమూరు: ఆలమూరు కోర్టు ఆవరణలో న్యాయమూర్తి వి.నాగేశ్వరరావునాయక్, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో కె.జాన్‌లింకన్, రెవెన్యూ కార్యాలయం వద్ద ఇన్‌చార్జి తహసీల్దారు ఐపీ శెట్టి, పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ శ్రీనునాయక్, శ్రీసిద్ధార్థ హైస్కూల్లో డైరెక్టర్ కె.ముల్లారావు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జడ్పీటీసీ వాసంశెట్టి దుర్గాభవానీ, ఏఎంసీ ఛైర్మన్ యనమదల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో నాతి బుజ్జి, తహసీల్దారు కార్యాలయం వద్ద తహసీల్దారు అనిల్‌కుమార్, పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్‌ఐ కిరణ్‌కుమార్, పంచాయతీల వద్ద కార్యదర్శులు, పాఠశాలల వద్ద హెచ్‌ఎంలు జాతీయ జెండాలను ఎగురవేశారు. విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

మండపేట: మండపేట పట్టణం, మండలంలో గణతంత్ర వేడుకలు జరిగాయి. మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ రాణి, వార్డు కౌన్సిలర్లు, కమిషనర్ రామ్‌కుమార్, ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఐదం రాజు, సహచర ఉద్యోగులు పాల్గొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గణతంత్ర వేడుకలు జరుపుకున్నారు.

కొత్తపేట: వాడపాలెంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు, ఆర్డీవో కార్యాలయం వద్ద ఆర్డీవో ముక్కంటి, డీఎస్పీ కార్యాలయం వద్ద డీఎస్పీ కేవీ రమణ, తహసీల్దారు కార్యాలయం వద్ద జీడీ కిషోర్‌బాబు, ఎంపీడీవో మహేశ్వరరావు, సర్పంచ్ బూసి జయలక్ష్మి జాతీయ జెండాలను ఆవిష్కరించారు. విద్యార్థులకు మిఠాయిలు పంచారు.

రావులపాలెం: రావులపాలెంలోని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, విద్యా సంస్థల్లో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.

ఉప్పలగుప్తం: తహసీల్దారు కార్యాలయం వద్ద తహసీల్దారు జవ్వాది వెంకటేశ్వరి, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ దంగేటి వీరఅచ్యుతజానకీరాంబాబు, పంచాయతీ కార్యాలయాల వద్ద కార్యదర్శులు కృష్ణాజీ, సాయిబాబు, పెట్టా నాగేశ్వరరావు, కె.రామలక్ష్మి, తిక్కిరెడ్డి రామకృష్ణ, వీధి సత్యనారాయణ, వర్రే నాగేంద్ర, ఈవోపీఆర్డీ కేఎస్ గౌరీకుమారి జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఎంఈవో కార్యాలయం వద్ద ఎంఈవో సత్తి సత్యకృష్ణ, గొల్లవిల్లి, భీమనపల్లి ఉన్నత పాఠశాలల్లో హెచ్‌ఎంలు లంక రాణి, నూకల సత్యనారాయణ, సొసైటీ కార్యాలయాల వద్ద సీఈవోలు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఎంపీడీవో కె.వెంకటేశ్వరప్రసాద్, సొసైటీల ఛైర్మన్లు శిరంగు సత్తిరాజు మారిశెట్టి పుండరీకాక్షుడు, ఊటాల రామాంజనేయులు, పెన్మెత్స వాసురాజు పాల్గొన్నారు.

రామచంద్రపురం: స్థానిక కోర్టు ప్రాంగణంలో రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు పతాకావిష్కరణ చేశారు. బార్ అసోసియేషన్ భవనం వద్ద ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ జెండా ఎగురవేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఎస్.సుధాసాగర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్ జాతీయ పతా కాన్ని ఆవిష్కరించారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, కొసనా శ్రీనివాసరావు, కె.విజయరాజు, సతీష్, వి.చంద్ర, ముత్యాల బాబ్జీ, గుణ్ణం వినోద్, వెంటూరి వీర్రాఘవులు ఈదల దొరబాబు పాల్గొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వి.సోమశేఖర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

తీవ్ర ఉద్యమంతో డిమాండ్ల సాధన

మామిడికుదురు, జనవరి 26: 42రోజుల తీవ్ర ఉద్యమంతోనే డిమాండ్లు సాధించుకున్నామని అంగన్‌వాడీల సంఘ జిల్లా అధ్యక్షురాలు బండి వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణిలు అన్నారు. మామిడికుదురు ఎస్సీ సామాజిక భవనంలో శుక్రవారం జరిగిన అంగన్‌వాడీల విజయోత్సవ సభలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కుడుపూడి సత్యనారాయణ, అంగన్‌వాడీ నాయకురాళ్లు ఎన్.అన్నపూర్ణ, జి.సూర్యకాంతం, కేవీ లక్ష్మి, డీవీ సరోజిని, జిల్లా ఐద్వా అధ్యక్షురాలు వరలక్ష్మి పాల్గొన్నారు.

పోరాట పటిమతో ఏదైనా సాధించవచ్చు

పి.గన్నవరం, జవవరి 26: ఉద్యమ సమయంలో సహకరించిన సంఘాలకు ధన్యవాదాలు చెబుతూ, పోరామ పటిమ ఉంటే ఏదైనా సాధించవచ్చని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణవేణి తెలిపారు. పి.గన్నవరంలో జరిగిన అంగన్‌వాడీల విజయోత్సవసభలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బండి వెంకటలక్ష్మి, హెచ్ఎం డీఎస్‌వీ ప్రసాద్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు బాలాజీ, డి.రామకృష్ణ, వరిగేటి రత్నం, ఎన్.శ్రీనివాసరావు, ప్రాజెక్టు లీడర్ వి.వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ సంఘ సభ్యులు కె.నాగలక్ష్మి, రాజ్యలక్ష్మి, లలిత, రాధ, అనంతలక్ష్మీదేవి, ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పురస్కారాలు

మామిడికుదురు, జనవరి 26: మామిడికుదురు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రవాసాంధ్రుడు నయినాల శ్రీనివాస్ సమకూర్చిన రూ.20 వేలు విలువైన ప్రతిభా పురస్కారాలను హెచ్ఎం సీహెచ్ నిరంజని పంపిణీ చేశారు. విద్యాభివృద్ధికి ఆయన అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబులు కొనియాడారు. కార్యక్రమంలో నయినాల తమ్మారావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిపేరు మార్పుపై నిరవధిక దీక్ష



ఆలమూరు, జనవరి 26: జొన్నాడలో ఉమా సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారి పేరు మార్చి పూజలు నిర్వహించడంపై ఆ గ్రామానికిచెందిన విశ్రాంతఉపాధ్యాయుడు ద్విభాష్యం శ్రీనివాస్ శుక్రవారం నిరవధిక దీక్ష చేపట్టారు. ఇదేవిషయమై ఆయన గత ఏడాది జనవరి 26న దీక్ష చేపట్టగా గ్రామస్తులు, అధికారులు ఇచ్చిన హామీతో విరమించారు. ఏడాది గడిచినా మార్పులేక పోవడంతో మళ్లీ దీక్ష చేపట్టారు. న్యాయం జరిగే వరకు దీక్షను కొనసాగిస్తానని చెప్పారు.

కేశవరంలో భవిష్యత్‌కు గ్యారంటీ..

మండపేట, జనవరి 26: కేశవరంలో బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు వంటగ్యాస్ సిలిండర్లు ఇవ్వడంతో పాటు అనేక పథకాలు అమలుచేస్తామన్నారు. టీడీపీ నేతలు కర్రి తాతారావు, కంటిపూడి శ్రీనివాసరావు, యు.రాంబాబు, పాలచర్ల శిరీష, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వాద ప్రసాదరావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఎంపిక



అంబాజీపేట, జనవరి 26: టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఇరుసుమండకు చెందిన చిన్నం బాలవిజయరావు, కె.పెదపూడికి చెందిన పెదపూడి శ్రీనివాసరావులను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెంనాయుడు ఉత్తర్వులు అందించినట్లు నామన రాంబాబు తెలిపారు.

ఆమ్‌ఆద్మీ పార్టీ గెలుపునకు కృషిచేయాలి

రావులపాలెం, జనవరి 26: రావులపాలెంలోని ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయం వద్ద కన్వీనర్ మెర్ల శాస్త్రులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర ఇన్‌చార్జి మణినాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ గెలుపునకు తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు.

గణతంత్ర వేడుకలు

యానాం, జనవరి 26: స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడామైదానంలో పరిపాలనాధికారి మునిస్వామి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పరిపాలనాధికారి మునిస్వామి, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఎస్పీ రఘునాయగం రంగుల బెలూన్స్, శాంతికపోతాలను ఎగురవేశారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పోలీసు, ఐఆర్‌బీ, హోంగార్డులు, విద్యార్థులు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ ఖండవిల్లి రామకృష్ణ, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. విద్యార్థులు చేసిన నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పరిపాలనా యంత్రాంగం యానాంలోని ప్రముఖులకు, అధికారులకు తేనేటి విందు ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా యానాం జవహర్ మినీ బాలభవన్, జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కాపునాడు మండల అధ్యక్షుడిగా గణపతిరావు



అంబాజీపేట, జనవరి 26: కాపునాడు మండల అధ్యక్షుడిగా కె.పెదపూడికి చెందిన యర్రా గణపతిరావు రాష్ట్రకాపునాడు వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బిరెడ్డి సురేష్ నుంచి ఉత్తర్వులందుకున్నారు. స్వగృహంలో ఆయనను కాపు నాయకులు సత్కరించారు. చిక్కం ఏసు, అబ్బిరెడ్డి మూర్తి, ఆకుల ఈశ్వరరావు, రాయపురెడ్డి శ్రీనివాసరావు, రాము, సాయిబాబా, చిక్కం రాము, బిక్కిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తండ్రికి అంత్యక్రియలు చేసిన కుమార్తె



పి.గన్నవరం, జనవరి 26: పి.గన్నవరం పంచాయితీ రోడ్డులో శుక్రవారం కుడిపూడి సత్యనారాయణ అనారోగ్యంతో మృతి చెందాడు. కుమారులు లేకపోవడంతో కుమార్తె శాంతికుమారి వైనతేయ నదిపాయ చెంతన శ్మశానవాటికలో తండ్రి అంత్యక్రియలు నిర్వహించింది.

టీడీపీతోనే బీసీ సాధికారత సాధ్యం



మాట్లాడుతున్న గంటి హరీష్‌మాధుర్

పి.గన్నవరం, జనవరి 26: బీసీలకు రక్షణ చట్టం కల్పించేది టీడీపీ మాత్రమేనని టీడీపీ అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జ్ గంటి హరీష్‌మాధుర్ అన్నారు. రాబోయే రోజుల్లో టీడీపీతోనే బీసీ సాధికారత సాధ్యమవుతుందన్నారు. లంకలగన్నవరంలో జరిగిన జయహో బీసీ సమావేశానికి మండల బీసీ సెల్ అధ్యక్షుడు శేరు త్రిమూర్తులు అధ్యక్షత వహించగా ఆయన మాట్లాడారు. బడుగు బలహీన వర్గాలు, బీసీ కులాలతో టీడీపీకి విడదీయరాని బంధమన్నారు. మరో ముఖ్య అతిథి టీడీపీ జిల్లా మహిళ అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి మాట్లాడుతూ అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ టీడీపీ మాత్రమేనని, చంద్రబాబు హయాంలోనే మహిళలకు సముచితస్థానం లభించిందన్నారు. టీడీపీ రాష్ట్ర నాయకులు పెచ్చెట్టి చంద్రమౌళి, గుత్తుల సాయి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో అభ్యర్థి ముఖ్యం కాదని వైసీపీ పతనమే ముఖ్యమన్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని స్థాపించాలని వారు పిలుపునిచ్చారు. తొలుత అంబేడ్కర్, జ్యోతిరావుపూలే, గాంధీజీ, ఎన్టీఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు షేక్ శుభాన్, ద్విసభ్య కమిటీ సభ్యుడు నామన రాంబాబు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, జనసేన నియోజకవర్గ పరిశీలకకుడు మద్దా చంటిబాబు, నాయకులు సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, మెల్లెటి శ్రీను, దాసరి వీరవెంకటసత్యనారాయణ, మట్టపర్తి రామకృష్ణ, బొంతు పెదబాబు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, పసలపూడి రామకృష్ణ, తొలేటి సత్తిబాబు, పెచ్చెట్టి వెర్రియ్య, చొల్లంగి సత్తిబాబు, పి.రమేష్, శేరు శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలని సెర్ప్ ఉద్యోగుల సమ్మె




అమలాపురం టౌన్, జనవరి 26: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ క్రాంతి పథంలో పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండు చేస్తూ నిరవధిక సమ్మెకు దిగారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరం ఏర్పాటు చేశారు. సెర్ప్ ఉద్యోగులకు పేస్కేలు అమలు చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని నినాదాలు చేశారు. డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. శిబిరంలో యూనియన్ జిల్లా శాఖ అధ్యక్షుడు డి.వరాలబాబు, కార్యదర్శి ముత్తాబత్తుల వెంకటేశ్వరరావు, కోశాధికారి కేవీబీ ప్రసాద్, ఎం.శామ్యూల్, ఎంవీఎల్ కుమారి, వీవీవీ రమణ, రమాకాంత్, అర్జున్, భూపతివర్మ, సయ్యద్, రమేష్, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ వయసు 62ఏళ్లకు పెంచాలి

మండపేట, జనవరి 26: 1998 డీఎస్సీ ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ 62ఏళ్లకు పెంచాలని కోరుతూ శుక్రవారం మండపేటకు వచ్చిన మంత్రి విశ్వరూప్‌ను 1998డీఎస్సీ ఉపాధ్యాయ సంఘ నాయకులు కోటిపల్లి రాంబాబు, పలు వురు ఉపాధ్యాయులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈనెలాఖరున క్యాబినెట్ సమావేశం జరుగుతుందని, ఉపాధ్యాయులు సమస్యను మంత్రిమండలి సీఎం దృష్టికి తీసుకువెళ్తామని మంత్రి హామీ ఇచ్చారు.

అంగర ఎస్‌ఐగా పరదేశి



కపిలేశ్వరపురం, జనవరి 26: అంగర ఎస్‌ఐగా అందే పరదేశి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అమలాపురం నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన జి.చంటి బదిలీపై వెళ్లారు.

ఉప్పలగుప్తం ఎస్‌ఐగా జోషి



ఉప్పలగుప్తం, జనవరి 26: ఉప్పలగుప్తం ఎస్‌ఐగా కె.మనోహర్‌జోషి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అమలాపురం టౌన్ ఎస్‌ఐగా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన జి.వెంకటేశ్వరరావు పదోన్నతిపై వెళ్లారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: 105
వెంకటరమణ	: డెవిల్
శ్రీలలిత	: కెప్టెన్ మిల్లర్
శేఖర్ స్క్రీన్-1	: హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	: నాసామిరంగ
రమా	: గుంటూరుకారం
గణపతి	: సైంధవ్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: హనుమాన్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: సలార్

మద్యం తాగడం మానేసినవారికి నగదు బహుమతి

ద్రాక్షారామ, జనవరి 26: మద్యం తాగడం మానేస్తే నగదు బహుమతి ఇస్తానని స్వాతంత్ర్య వేడుకల్లో ఇచ్చిన హామీ మేరకు ఎంపీటీసీ సభ్యుడు రెద్నం సతీష్ రూ.5వేలు చొప్పున ముగ్గురికి అందజేశారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని కాపవరంలో గీసాల సత్యనారాయణ, పంతగడ సత్యనారాయణలకు సర్పంచ్ యనమదల మంగాదేవి రూ.5వేలు చొప్పున, తాడిపల్లిలో అమలాపురపు పనసరాముడుకు రూ.5వేలు సర్పంచ్ పిల్లి అచల రాజేశ్వరి చేతులమీదుగా ఎంపీటీసీ సభ్యుడు రెద్నం సతీష్ అందజేశారు.

48గంటల్లో నిందితుడి అరెస్టు

అంతర్వేది, జనవరి 26: అంతర్వేదిపాలెం భారతమ్మకాల్వగట్టు వద్ద చేరుకోట రాజేష్ ఇంట్లో జరిగిన చోరీకేసులో 48గంటల్లో నిందితుడిని అరెస్టుచేసినట్టు సీఐ గోవిందరాజు తెలిపారు. ఎస్పీ శ్రీధర్ ఆదేశాలతో డీఎస్పీ కేవీ రమణ పర్యవేక్షణలో సీఐ ఆర్.గోవిందరాజు, ఎస్‌ఐ రాము నిందితుడిని అరెస్టుచేసి, అతని వద్ద నుంచి రూ.2లక్షల విలువైన బంగారం, వెండిఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. సీఐ గోవిందరాజు, ఎస్‌ఐ ఎస్.రాము, క్లూస్‌టీమ్ ఎస్‌ఐ కె.ప్రవీణ్‌కుమార్, క్రైమ్ ఎస్‌ఐ కిశోర్‌బాబు, సిబ్బందిని ఎస్పీ, డీఎస్పీలు అభినందించారు.

అంబేడ్కర్, బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణ

మండపేట, జనవరి 26: మండపేటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉపప్రధాని బాబుజగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహాలను ఏర్పాటుచేయడం హర్షణీయమని మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. స్థానిక కరాచీ సెంటర్‌లో శుక్రవారం అంబేడ్కర్, బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహాలను మంత్రి విశ్వరూప్, ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అధ్యక్షతన జరిగిన ఆవిష్కరణ సభకు నియోజకవర్గం నుంచి దళిత నేతలు, ఎంపీలు చింతా అనురాధ, పిల్లి సుభాస్‌చంద్రబోస్, ఎమ్మెల్సీలు, పండుల రవీంద్రబాబు, బొమ్మి ఇజ్రాయల్, జూపల్లి ప్రభాకర్ పాల్గొన్నారు. సభలో వైసీపీ నేతలు కర్రి పాపారాయుడు, వేగుళ్ల పట్టాభిరామయ్య, రెడ్డి రాధాకృష్ణ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, కౌన్సిలర్లు, వైసీపీ నేతలు, దళిత నేతలు, యువత పాల్గొన్నారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్‌మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ నివాళులర్పించారు.

టీడీపీ గెలుపు కోసం పాటుపడాలి

రావులపాలెం, జనవరి 26: టీడీపీనిఅధికారంలోకి తెచ్చేందుకుప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ కోరారు. శుక్రవారం గోపాలపురంలోని ఆయన నివాసం వద్ద క్లస్టర్ సమావేశం నిర్వహించారు. యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లకు శిక్షణ ఇచ్చారు. బొల్ల రాజేష్, మైగాపుల గురవయ్యనాయుడు, జక్కంపూడివెంకటస్వామి పాల్గొన్నారు.

మెగాస్టార్‌కు అరుదైన గౌరవం దక్కింది

పి.గన్నవరం, జనవరి 26: మెగాస్టార్ చిరంజీవికి అరుదైన గౌరవం దక్కిందని చిరంజీవి యువత రాష్ట్ర నాయకుడు గుండాబత్తుల తాతాజీ అన్నారు. చిరంజీవికి పద్మవిభూషణ్ అవార్డు రావడంతో పి.గన్నవరం మూడురోడ్ల కూడలిలో కేక్‌కట్‌చేసి సంబరాలు జరుపుకుని, బాణంసంచా కాల్చారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మద్దా చంటిబాబు, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరావు, కార్యదర్శి వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, కందాల చంటి, తాటికాయ శ్రీను, కోట రాజేందర్, వెంకటేష్, దైవాల రాంబాబు, మడిమెట్ల శేఖర్ పాల్గొన్నారు.

ఆందోళన విరమించిన సిబ్బంది

యానాం, జనవరి 26: చర్చలు సఫలం కావడంతో యానాం ప్రభుత్వాసుపత్రి వద్ద 26రోజులుగా ఆందోళన చేస్తున్న సిబ్బంది ఆందోళన విరమించారు. పుదుచ్చేరి ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు స్థానిక అధికారులతో చర్చలు జరిపారు. పుదుచ్చేరిలోని ఉన్నతస్థాయి అధికారులతో యానాం పరిపాలనాధికారి, యానాం ఆసుపత్రి డీడీ చర్చలు జరిపారు. ఫిబ్రవరి19లోగా 42నెలల జీతాలు ఇచ్చేందుకు, ఉద్యోగ భద్రత, పదోన్నతి తదితర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం హామీ ఇచ్చింది. చర్చలు ఫలించడంతో మధ్యాహ్నం నుంచి సిబ్బంది విధులకు హాజరయ్యారు.

రహదారి భద్రతపై అవగాహన

రావులపాలెం, జనవరి 26: డ్రైవర్లకు రహదారి భద్రతపై ఎంవీఐ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. అసిస్టెంట్ ఎంవీఐ నాగేంద్ర భద్రతా నియమాలను వివరించారు.

గెలిచే వ్యక్తికే రాజోలు సీటు కేటాయించాలి



గొల్లపల్లికి సంఘీభావం ప్రకటిస్తున్న తెలుగుదేశం నాయకులు

మలికిపురం, జనవరి 26: సర్వేలను ప్రాతిపదకగా తీసుకుని నెగ్గే వ్యక్తికే రాజోలు శాసనసభ సీటు కేటాయించాలని రాజోలు నియోజకవర్గ టీడీపీ నాయకులు డిమాండు చేశారు. శుక్రవారం కొల్లాబత్తుల కుమార్ ఇంటి వద్ద జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడారు. రాజోలు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలంగా ఉందన్నారు. రెండు పార్టీల్లో సర్వేలను బట్టి ప్రజా ఆదరణ ఉన్న వ్యక్తికి రాజోలు సీటు కేటాయించాలని డిమాండు చేశారు. కొవిడ్‌ను సైతం లెక్కచేయకుండా ఐదేళ్ల పాటు మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు రాజోలు నియోజకవర్గంలో కార్యకర్తలకు ఏకష్టం రాకుండా అండగా ఉన్నారన్నారు. ప్రతిపక్షంలో ప్రజల తరుపున పోరాటం చేసిన గొప్ప నాయకుడన్నారు. రాజోలు నియోజకవర్గాన్ని తన హయాంలో ప్రగతి పథంలో నడిపించారని, అధిష్టానం ఆలోచించాలని కోరారు. సమావేశంలో రాజోలు ఎంపీపీ కేతా శ్రీను, మంగెన భూదేవి, అడబాల సాయిబాబు, చెల్లింగి సత్యనారాయణ, సాగి పాపయ్యరాజు, అడబాల యుగంధర్, చాగంటి స్వామి, తాడి సత్యనారాయణ, కసుకుర్తి త్రినాథస్వామి, రుద్రరాజు బంగార్రాజు, కడలి వెంకటరత్నం, అంతర్వేదిపాలెం పుల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

ముమ్మిడివరం, జనవరి 26: వైఎస్సార్ ఆసరా పథకంతో డ్వాక్రా మహిళలను సీఎం జగన్ ఆర్థికంగా బలోపేతం చేశారని ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో శుక్రవారం నగర పంచాయతీ ఛైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో మండలంలో రూ.10,80,63,794 ఆసరా చెక్కులను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కోలా గంగాభవానీ, జడ్పీటీసీ కుడుపూడి శంకరరావు, నాయకులు పెన్మెత్స చిట్టిరాజు, హితకారిణి సమాజ్ ఛైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, పెయ్యల చిట్టిబాబు, వక్ఫ్ బోర్డు జిల్లా ఛైర్మన్ ఖాదర్‌వల్లి, జగతా బాబ్జి, కాదా గోవిందకుమార్, బొంతు బుజ్జిబాబు, తిరుకోటి శాంతిసుధ, వరసాల రమాదేవి, చెల్లి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీకి ప్రశంసాపత్రాలు

ఐ.పోలవరం, జనవరి 26: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి రిపబ్లిక్ డే పురస్కారాలు లభించినట్టు జిల్లా రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మన్ పిన్నమరాజు వెంకటపతిరాజు తెలిపారు. ఛైర్మన్ కోరుకొండ సత్యనారాయణ (డిల్లీ నారాయణ), వైస్ ఛైర్మన్ పిన్నమరాజు వెంకటపతిరాజు, ట్రెజరర్ ముదునూరి సతీష్‌రాజు, ఒలుగుల బాలరాజు, రెల్లి సుజాతలకు మంత్రి పినిపే విశ్వరూప్, కలెక్టర్ హిమాన్షుశుక్లా ప్రశంసా పత్రాలు అందించారు.

మార్పు కావాలి- కాంగ్రెస్ రావాలి

కాట్రేనికోన, జనవరి 26: కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి గతంలో కాంగ్రెస్ పాలనలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత పరిస్థితిని ప్రజలకు వివరించాలని పీసీసీ సభ్యుడు జగ్గప్పరాజు సూచించారు. శుక్రవారం కుండలేశ్వరంలో మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అయితాబత్తుల పండుబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కంచుస్తంభం సోనీ, పాలెపు ధర్మారావు, మల్లాడి గోపి, లంకే నాగరాజు, పాలెపు సత్తిరాజు, పాలెపు శ్రీను, ఓలేటి ధర్మరాజు పాల్గొన్నారు.

బీజేపీ మతోన్మాద విధానాలకు నిరసన

అమలాపురం టౌన్, జనవరి 26: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద విధానాలను నిరసిస్తూ అమలాపురం గడియార స్తంభం సెంటర్లో కిసాన్‌మోర్చా, కార్మిక సంఘాలు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ సారథ్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశ సంపదను మోదీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోందన్నారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టిబత్తుల తులసీరావు, నాయకులు గెద్దం విజయ కుమార్, శెట్టిబత్తుల బాబ్జీ, కాశి శ్రీనివాసరావు, కె.శంకర్, తాడి శ్రీరామమూర్తి, ఈశ్వరి, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

'కార్యకర్తలకు అందుబాటులో ఉంటా'

మామిడికుదురు, జనవరి 26: నాయకులు, కార్యకర్తలకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని జడ్పీ ఛైర్మన్, వైసీపీ పి.గన్నవరం ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. వైసీపీ మండలశాఖ సమావేశం పెదపట్నంలంకలో మండలశాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సమావేశానికి పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, జడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు హాజరు కాలేదు. సమావేశంలో నాయకులు జక్కంపూడి తాతాజీ, తోరం భాస్కర్, నెల్లి దుర్గాప్రసాద్, తులా గోపాలకృష్ణ, జక్కంపూడి వాసు, ఎంపీటీసీ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయం ప్రారంభం

పి.గన్నవరం, జనవరి 26: పి.గన్నవరంలో వైసీపీ నియోజకవర్గ కార్యాలయాన్ని జడ్పీ ఛైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ విప్పర్తి వేణుగోపాలరావు ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, నక్కా చినవెంకటేశ్వరరావు, అడ్డగళ్ల వెంకటసాయిరాం, కొమ్ముల రాము, కుడిపూడి విద్యాసాగర్, యన్నాబత్తుల ఆనంద్, సాధనాల రమేష్, కొక్కిరి రవికుమార్, దేశరాజు సీతారామయ్య, నాయకులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సాయం

అమలాపురం రూరల్, జనవరి 26: సాకుర్రులో జరిగిన అగ్ని ప్రమాదంలో బొలిశెట్టి శివకు చెందిన ఇల్లు అగ్నికి ఆహుతి కాగా శుక్రవారం సర్పంచ్ పెద్దిరెడ్డి రాము ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నాయకులు పరామర్శించి సాయం అందించారు. టీడీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు, జనసేన పార్లమెంటు ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్, అసెంబ్లీ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, చొల్లంగి సత్యసాయిబాబా, లింగోలు పండు, యాళ్ల నాగసతీష్ తదితరులు రూ.50వేలు ఆర్థిక సాయం, నిత్యావసర వస్తువులు అందజేశారు.

సిద్ధి వినాయకుడిని దర్శించుకున్న సామవేదం

అయినవిల్లి, జనవరి 26: ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖశర్మ సతీసమేతంగా శుక్రవారం అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు వేదాశీర్వచనం అందజేసి శేష వస్త్రంతో సత్కరించారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ఆత్రేయపురం, జనవరి 26: స్థానిక సత్యసాయి సేవా కేంద్రంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయ వైద్యులు రోగులను పరీక్షించి కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేశారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం

కొత్తపేట, జనవరి 26: కొత్తపేట శివారు చినరాముడు నూరిమెరకలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో ఒక ఇల్లు దగ్ధమై రెండు కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. బాధితులు యనమదల మంగాదేవి, దుర్గాభవాని కుటుంబాలను మాజీఎమ్మెల్యే బండారు సత్యానందరావు పరామర్శించి నగదు, 50కిలోల బియ్యం అందించారు. యల్లమిల్లి జగన్మోహన్, కొప్పిశెట్టి వాసు పాల్గొన్నారు.